12_NOV_2023_F_SUNMAG 760 Real 11/08/2023 10:01 PM Page 9

## విదురుడి మాట..

మహాభారతంలో ఉద్యోగ పర్వానికి, ఎన్నికల రాజకీయాలకు ఎన్నో పోలికలు. తెలంగాణ గడ్డ నేడు ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంగా మారింది. వాసుదేవ కృష్ణుడు సారథిగా పాండవ పక్షం ఒక పక్క.. దుర్యోధన, దుశ్శాసనాదులను తలపించే విపక్షాలన్నీ మరో పక్క. అక్షౌహిణుల కొద్దీ ప్రజా సైన్యమంతా కేసీఆర్ వైపు.. పొరుగు రాష్ట్రం నుంచీ తరలించిన నోట్లకట్టలు, ఢిల్లీ నుంచి ఊడిపడిన బాడుగ నేతలు మరొక వైపు. అలనాడు.. మహా సంగ్రామ సమయంలో నీతికి, రీతికి పెద్దపీట వేస్తూ విదురుడు కురుసార్వభౌముడైన ధ్రుతరాష్ట్రునికి చేసిన జ్ఞానబోధ నాయకుడి లక్షణాలను వివరిస్తుంది. పరోక్షంగా ఓటరుకు కర్తవ్య దీక్షోపదేశం చేస్తుంది.

**యస్య కృతం న జానంతి మంత్రం వా మాత్రితం పరే**
**కృతమేవాస్య జానంతి సవై పండిత ఉచ్యతే!**

.. నాయకుడు లక్ష్య సాధనకు తనదైన మార్గాన్ని ఎంచుకుంటాడు. తనవైన వ్యూహాల్ని అమలుచేస్తాడు. తను సమీకరించుకున్న బలగాన్ని మోహరిస్తాడు. అంతిమంగా అనుకున్నది సాధిస్తాడు. ఇదే విషయాన్ని ఇంగ్లిష్‌లో.. మిషన్, విజన్, వాల్యూస్, విక్టరీగా సంక్షిప్తం చేయవచ్చు. తెలంగాణ ఉద్యమ జెండాను భుజానికి ఎత్తుకునే సమయానికి.. కేసీఆర్ ఒక ఒంటరి అంకె. అయితేనేం, తనకంటూ ఓ మిషన్ ఉంది. స్పష్టమైన విజన్ ఉంది. బలంగా నమ్మిన వాల్యూస్ ఉన్నాయి. కాబట్టే, విక్టరీ వరించింది. రాష్ట్రం ఆవిర్భవించింది. ఇలాంటి మడమతిప్పని నాయకత్వమే రాజ్యానికి మేలు చేస్తుందని చెబుతాడు విదురుడు. అజ్ఞానుల చేతిలోని అధికారాన్ని, అవినీతిపరుల జేబులోని సంపదను విదురుడు పిల్లి నోట్లోని మాంసంతో పోలుస్తాడు. పంచుకోవడం నాయకుడి లక్షణం. కోడి పిల్లల్ని పొదిగినట్టు.. సంపదను పదింతలు చేయడం పాలకుడి బాధ్యత. గండుపిల్లిని గుర్తుకు తెచ్చే దండగమారి మూకలు మాత్రం అంతా తమకే కావాలంటాయి. అన్నీ తమ గల్లాపెట్టెకే చేరాలంటాయి. భూముల్ని మింగేస్తాయి. నీటిని పిండేస్తాయి. గనుల్ని గుటుక్కుమనిపిస్తాయి. పంచభూతాలను ఆక్రమించే పెనుభూతాలవి. 'వద్దు. ఆ మార్గాల సంతతిని దగ్గరికి రానివ్వకండి' అని హెచ్చరిస్తాడు విదురుడు.

***తమ దారెరుగుట, వేగప***
***డమి, దాలిమి, విడుపు గలుగుటయు లేని ప్రభు***
***త్వము గలదె? వారియందీ***
***సుమానుషము లొకడు బట్టి చూడం గలడే?***

'తన గురించి తనకు ఎరుక ఉండాలి. దుందుడుకు స్వభావం కూడదు. కొండంత ఓర్పు అవసరం. పట్టువిడుపులు తెలిసి ఉండాలి. వాడూ పాలకుడంటే!' అంటూ నాయకత్వానికి కొలమానాన్ని ప్రసాదించాడు ఆ మహానుభావుడు. ఉద్యమ సమయంలో కేసీఆర్ చూపిన ఓర్పు, నేర్పు, జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టే విషయంలో ప్రదర్శించిన పట్టువిడుపులు.. అన్నీ కలిసి అద్భుత ఫలితాన్ని ఇచ్చాయి. దశాబ్దాల కలను నెరవేర్చాయి.

## రెండు మార్గాలు..

ఏ నాయకుడైనా లక్ష్యాన్ని సాధించడానికి రెండు మార్గాలు ఉంటాయి. యుద్ధం, రాయబారం. బొగ్గుల కోసం అడవుల్ని నరికే లీడర్లకు కొదవ లేదు. ఆ బాపతు నాయకులు అధికారం కోసం సమాజాన్ని నిట్టనిలువునా చీల్చేస్తారు. స్వార్థం కోసం వ్యవస్థల్ని నిర్వీర్యం చేస్తారు. తమ ఉనికి నిలబెట్టుకోడానికి విద్వేషాన్ని లావాలా ఎగజిమ్ముతారు. అలాంటి అసుర సంతతిని దూరం పెట్టమని సలహా ఇస్తాడు విదురుడు. అదే సమయంలో శాంతికాముకుడైన పాలకుడి వ్యవహార శైలిని కూడా ఎరుకపరుస్తాడు. దండలు కుట్టేవాడు చెట్టు నుంచి పువ్వును కోసినంత సున్నితంగా, తుమ్మెద మకరందాన్ని గ్రోలినంత సజావుగా.. దక్షత కలిగిన ప్రజాపతి తన కార్యాన్ని నెరవేర్చుకుంటాడు. జనానికి ఏమాత్రం నష్టం కలిగించడు. హింసకు తావివ్వడు. ధ్వంసానికి చోటివ్వడు. ఆగ్రహాన్ని కూడా నిగ్రహంగానే వ్యక్తం చేస్తాడు. ఇలాంటివారి పాలనలో పితృత్వ భావన ఉంటుంది. ఇంటి పెద్దలా ఆలోచిస్తాడు. సంయమనంతో వ్యవహరిస్తాడు. 'ప్రజల్ని వృక్ష సమూహంలా కలిపి ఉంచేవాడే నాయకుడు' అంటుంది విదురనీతి. చెట్టు ఒంటరిగా ఉంటే.. ఏ ఏనుగో వచ్చి కూల్చేస్తుంది. అదే సమూహ శక్తిని తలపించే కారడవిని మదగజమైనా ధ్వంసం చేయలేదు. నాయకుడికి, ప్రజలకు మధ్య ఉండాల్సిన అవినాభావ సంబంధాన్ని వివరిస్తూ.. పాలకుడిని పులితో, ప్రజలను అడవితో పోలుస్తాడు విదురుడు. అడవి వల్ల పులికి రక్ష. పులి వల్ల అడవికి రక్ష. కానీ కొన్ని నరహంతక మృగాలు.. అడవిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాయి.

ప్రతి ఒక్కరిలోని మంచికి విదురుడు ప్రతినిధి అయితే.. చెడుకు ధ్రుతరాష్ట్రుడు ప్రతీక. మనిషి చాలాసార్లు విచక్షణ కోల్పోతాడు. అజ్ఞానాంధుడిగా మారిపోతాడు. ఆ సమయంలో.. వివేకంతో మెలగాలి. విదురుడి మార్గంలో నడవాలి. ధర్మాన్నే గెలిపించాలి. రాష్ట్ర అవతరణకు ముందున్న యాభై ఏండ్ల కౌరవ పాలన పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలి. సకలజనుల క్షేమానికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కేసీఆర్ నాయకత్వాన్నే బలపరచాలి.

## ఇదం.. కౌటిల్యం

ఒకవైపు చంద్రగుప్త మౌర్యుడిని తలపించే చంద్రశేఖరుడు. మరోవైపు.. అహంకారాన్ని, అజ్ఞానాన్ని ఒళ్లంతా నింపుకొన్న నందుల సంతతి రాబందులు. ఈ పోరాటంలో కౌటిల్యుడి సైద్ధాంతిక మద్దతు కేసీఆర్‌కే. ఎందుకంటే, అర్థశాస్త్రంలోని ప్రతి సంక్షేమ సూత్రమూ తెలంగాణలో యథాతథంగా అమలవుతున్నది. రాజకీయ వ్యూహ రచనలోనూ కేసీఆర్ చాణక్యుడికి సరిసాటి అనిపిస్తాడు.

అర్థశాస్త్రం.. ఓ చదరంగపు బల్ల. ఓ వైపు మంచి, మరో వైపు చెడు. ఆట రంజుగా సాగుతుంది. చాణక్యుడు మంచికి ప్రతినిధిగా పావులు కదుపుతాడు. చెడును నిలువరిస్తాడు. అశాంతిని తరిమేస్తాడు. ఆటవిక న్యాయాన్ని అడ్డుకుంటాడు. తన గ్రంథాన్ని ఆయన 'ఓం నమః శుక్రబృహస్పతిభ్యాం' అంటూ ఆరంభించడం వెనుక కారణమూ ఇదే. బృహస్పతి దేవ గురువు. శుక్రాచార్యుడు అసురుల పురోహితుడు. మంచిచెడులకు ఇద్దరూ రెండు ప్రతీకలు. ఎన్నికలు సైతం మంచి చెడుల మధ్య జరిగే బ్యాలెట్ యుద్ధమే. కరెన్సీ ప్రలోభాలకు, కులమత ప్రభావాలకు లొంగకుండా.. దైవీశక్తులనే గెలిపించాలి. 'పాలకుడి దండానికి నిద్ర ఉండదు' అంటూ రాజ్యంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన తొలి బాధ్యత పాలకుడిదే అని గుర్తుచేస్తాడు చాణక్యుడు. కేసీఆర్ కూడా దండనీతికి ఎనలేని ప్రాధాన్యం కల్పించాడు. పోలీసు బలగాలను శక్తిమంతం చేశాడు. నిఘా వ్యవస్థను గట్టిపరిచాడు. ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాడు. కాబట్టే, పదేండ్లలో జనం కర్ఫ్యూ అనే మాటే మరిచిపోయారు. మత ఘర్షణలు మూసీలో కొట్టుకుపోయాయి. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా అవతరించింది. తెలంగాణ సర్కారుకు శాంతి భద్రతలు.. రెండు కళ్లుగా మారాయి.

**అనుకున్నది సాధించడం.**
**సాధించినది నిలబెట్టుకోవడం.**
**నిలబెట్టుకున్నది విస్తరించడం.**
**ఆ విస్తరణ ఫలాలను ప్రజలకు పంచడం.**

### భీష్మ ఉవాచ..



**ఆచార్యుడి మాట మహా పదును. భావం ఎంతో లోతు. గురువు బెత్తం ఝుళిపించినట్టు ఉంటుంది వ్యవహారం.**

- నాయకుడు ముఖస్తుతికి లొంగిపోవద్దు. నిష్ఠుర సత్యాలకు కోపం తెచ్చుకోవద్దు.
- ఆత్మావలోకనం లేని మనిషి.. రెండు కళ్లున్నా అంధుడే.
- తీరని అప్పు, ఆరని నిప్పు ఎప్పుడూ ప్రమాదమే.
- నదీ ప్రవాహం ఒడ్డును కోసినట్టు శత్రువును క్రమంగా బలహీనపరచాలి. దెబ్బ తెలియ కూడదు. గాయం మానకూడదు.
- మాట నిలబెట్టుకోలేని నాయకుడి కోట కూడా ఎంతోకాలం నిలబడదు.
- అరిషడ్వర్గాలను గెలవలేకపోతే.. ప్రజాభిమానాన్నీ సాధించలేవు.
- పన్నులు.. స్వచ్ఛంగా చెల్లించగలిగేంత సరళంగా ఉండాలి కానీ, బలంగా వసూలు చేసేంత భారం కాకూడదు.
- వృథా.. ఇంటికైనా, రాజ్యానికైనా అస్సలు మంచిది కాదు.
- ప్రజలకు ఉపయోగపడే ఆస్తులను ఆక్రమించుకునేవారు.. నరకానికి పోతారు.
- మూడుతరాల కోసం ఆలోచించడం మూర్ఖత్వం. మూడేండ్లు బతకడానికి సరిపడా సంపాదిస్తే చాలు.
- పాండవుల సైన్యంతో పోలిస్తే కౌరవ మూకల బలమే ఎక్కువ. కానీ, కుంతీ పుత్రులకు ధర్మబలం తోడైంది.